## అధినేతకు కేసీఆర్‌కు నీరాజనం



కోరుట్లలో అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జగిత్యాల నుంచి నిజామాబాద్ వెళ్లిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దారి పొడవునా ప్రజలు నీరాజనం పట్టారు. జగిత్యాల నుంచి మొదలుకొని ఇబ్రహీంపట్నం మండలం వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రజలు బారులు తీరి కేసీఆర్ బస్సుపై పూల వర్షం కురిపించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పలుచోట్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి, గజమాలలు వేసి స్వాగతించారు.

- మెట్‌పల్లి/ కోరుట్ల/ కోరుట్ల రూరల్ / మేడిపల్లి/ఇబ్రహీంపట్నం, మే 6

# కాంగ్రెస్ మోసం.. బీజేపీ విషం

## పదేళ్ల కేసీఆర్ పాలనే నిజం • గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

- కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదే
- 10 నుంచి 12 సీట్లు గెలిస్తే రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయిలో ఉంటాం
- మీ దయతో గెలిచిన.. కార్మికులను కాపాడుకున్నం
- ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనే మళ్లీ ఆత్మహత్యలు
- ఆ పార్టీ అభ్యర్థి ఎవరో గుర్తు పట్టే పరిస్థితి లేదు
- మోదీ దేవుడి పేరిట రాజకీయం
- బండి సంజయ్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వినోద్ కుమార్‌ను గెలిపించాలని పిలుపు

### వినోదన్నను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

బోయినపల్లి వినోద్ కుమార్ కరీంనగర్ ప్రజల గొంతుక. ఆయన విద్యావంతుడు, ఉద్యమకారుడు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఎదురుదెబ్బలు తిని కేసీఆర్‌కు కుడి భుజంగా ఉన్నడు. తెలంగాణ కోసం చేసిన పోరాటంలో ఢిల్లీలో అండగా నిలిచిండు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్‌ను ఎంతో అభివృద్ధి చేసిండు. ఆయన గెలిస్తే మన కోసం కొట్లాడుతడు. మన హక్కుల కోసం పోరాడుతడు. ఈ ఎంపీ ఎన్నికల్లో మన అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. లుచ్చా మాటలు చేప్పే రేవంత్‌రెడ్డికి, గాలి తిరుగుడు, గాలి మాటలు చెప్పే బండి సంజయ్‌కు ఓటుతోనే బుద్ధి చెబుదాం. ఈ నెల 10న కేసీఆర్ సిరిసిల్ల రోడ్‌షోను విజయవంతం చేద్దాం.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

రాజన్న సిరిసిల్ల (నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల రూరల్/ముస్తాబాద్, మే 6: 'పదేళ్ల నిజం కేసీఆర్ పాలన. పదేళ్ల విషం నరేంద్ర మోదీ పాలన. 150 రోజుల అబద్ధం రేవంత్ రెడ్డి పాలన. ఈ మూడింటి మధ్యనే ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. గులాబీ జెండానే మన తెలంగాణకు శ్రీరామ రక్ష' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడే మంచిగుండేదని రాష్ట్ర ప్రజలందరూ అనుకుంటున్నారని, అయితే వారికి ఒక ఉపాయం చెబుతానని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పది నుంచి పన్నెండు సీట్లలో బీఆర్ఎస్ గెలిస్తే ఆరు నెలల్లోనే రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయిలో ఉంటామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో మనకు ఏ పార్టీతో పోటీ లేదని, మనకు మనమే పోటీ అని చెప్పారు. ఐకమత్యంగా ఉంటే వినోద్‌కుమార్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బండి సంజయ్ కోసం కాంగ్రెస్ కరీంనగర్‌లో డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందని, తంగళ్లపల్లి చౌరస్తాలో ఆ అభ్యర్థిని నిలబెడితే ఆ పార్టీ వాళ్లే గుర్తు పట్టరని, ఇంకా ఎవరు గుర్తు పడుతారని ఎద్దేవా చేశారు. నమో అంటే నరేంద్ర మోడీ కాదని, నమ్మించి మోసం చేయడమేనని విమర్శించారు. దేవుడి పేరు చెప్పి మార్కెటింగ్ చేయడం .. మతం పేరిట ఓట్ల రాజకీయం చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నమో రామ చంద్రా అనే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం, రంగుల సినిమా చూపించి ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. సిరిసిల్లలో పదేళ్లుగా ఆత్మహత్యల మాట వినబడలేదని, మళ్లీ ఇప్పుడు నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఉదయం సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, గాంధీచౌక్, తెలంగాణచౌక్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం తంగళ్లపల్లి ఎస్ఎస్ గార్డెన్, ముస్తాబాద్ మండలం సాయిదత్త ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండలాల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై వారికి దిశానిర్దేశం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఎంత ఆవశ్యకమో వివరించారు. కాంగ్రెస్ మోచేతికి బెల్లం పెట్టి మోసపూరిత హామీలతో గెలిచిందని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి అమలు చేసి మొగోళ్లకు, ఆడోళ్లకు తాకులాట పెట్టిందని మండిపడ్డారు. ఈ ప్రాంత ఎంపీగా బండి సంజయ్ ఐదేళ్లలో ఏంచేశారని నిలదీశారు. సిరిసిల్లకు, తంగళ్లపల్లి, ముస్తాబాద్‌కు ఒక్క పనైనా చేసిండా..? ఒక్క శిలాఫలకమైనా వేసిండా..? ప్రశ్నించారు. ఇదే కేసీఆర్ సిరిసిల్ల, కరీంనగర్ పరిధిలో ఎన్నో పనులు చేశారని వివరించారు. మరీ ఏమి చేయని మోడీకి ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షాలపై కక్షపూరితంగా వ్యవహరించలేదని, నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టలేదని చెప్పారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేశామని, బీఆర్ఎస్ కార్యకర్తలు కొద్ది రోజులు ఓపిక పట్టాలని, మనకో రోజు వస్తుందని, మిత్తితో సహా చెల్లిద్దామని ధైర్యం నింపారు. కలిసికట్టుగా కొట్లాడితే విజయం మనదేనని నిర్దేశం చేశారు. కార్యక్రమాల్లో నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఎంపీపీ పడిగెల మానస తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు అన్నీ అర్థమైనయి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పింది. ₹2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతుకూలీలు, కౌలు రైతులకు పైసలిస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి మోసం చేసిండు. ఇంకా మహిళలకు ₹2500, ₹4వేల పింఛన్, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పి ముంచిండు. కరెంట్, సాగునీరు, బోనస్ సంగతి పక్కన పెట్టిండు. తంగళ్లపల్లి బ్రిడ్జి కింద నీళ్లు లేకుండా చేసిండు. ఊసరవెల్లి లెక్క రుణమాఫీకి తేదీలను మార్చుతున్నడు. ఎక్కడికి వెళ్లినా సరే దేవుడు మీద ఒట్లు పెడుతున్నడు. కేసీఆర్‌ను తిడుతున్నడు. ఈ ఐదు నెలల్లో ప్రజలందరికీ అన్ని విషయాలు అర్థమైనయి. అందుకే అన్ని వర్గాలు కోపంగా ఉన్నయి.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### జిల్లా ఎత్తేస్తరట

బీజేపోళ్లు డైరెక్ట్‌గా 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్రు. ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలంటే కచ్చితంగా పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఉండాలి. మన గోదారి నీళ్లను కర్ణాటక, తమిళనాడుకు తరలించాలని మోదీ చూస్తున్నడు. ఇలాంటి కుట్రలను ఎదుర్కోవడం బీజేపీ, కాంగ్రెస్ వాళ్లతో అయ్యే పని కాదు. జూన్ 2 తర్వాత హైదరాబాద్‌ను యూటీ చేయాలని బీజేపీ కుట్ర చేస్తున్నది. ఇక పార్లమెంట్ స్థానానికి ఒక్కటే జిల్లా ఉండాలని రేవంత్‌రెడ్డి చెబుతున్నడు. గులాబీ జెండాకు గుండె ధైర్యం ఇవ్వండి. జిల్లా రద్దుపై కొట్లాడుతం.

- కేటీఆర్

### మీ దయతో గెలిచిన

నాకు రాజకీయ జన్మనిచ్చింది సిరిసిల్లే. గత ఐదు ఎన్నికల్లో ఒక్క రూపాయి, మందు పంచలేదు. ప్రజలు చూపిన దయతో గెలిచిన. నాకు ఓటేసిన మీ అందరికీ రుణపడి ఉంట. శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్న. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ₹3 వేల కోట్లు ఖర్చు చేసి సిరిసిల్ల నేత కార్మికులను కాపాడుకున్నం. అభివృద్ధిలో సిరిసిల్లను అతి సుందరంగా తీర్చిదిద్దుకున్నం. నియోజకవర్గంలో పెద్ద మండలమైన తంగళ్లపల్లి నుంచి ఈ సారి నాపై కొంత కోపంగా ఉన్నట్టున్నరు. మెజార్టీని తగ్గించిన్రు. నేను తెలిసోతెలియకో తప్పు చేసి ఉంటే క్షమించాలి.

### మోడీ, బండి మొఖాలకు మొక్కాలా..?

నరేంద్ర మోడీ రాముడిపేరుతో రాజకీయాలు చేస్తున్నడు. ఇంటింటికీ రాముడి పటం పంపించిండు. మొక్కుదామంటే వాటిపై మోడీ, బండి సంజయ్ ఫొటోలున్నయి. దేవుడి పటం మీద బల్లి పట్టినట్టు వాళ్ల మొఖాలు చూస్తూ ఎలా మొక్కాలి. సెంటిమెంటుతో కొట్టుడు తప్ప పైసా పని చేయని వారిని నమ్మి మోసపోవద్దు.

### దేవుడి పేరిట రాజకీయలా..?

మోడీ 2014లో ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిండు. ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అదే ఏడాదిలో బీఆర్ఎస్ కూడా అధికారంలోకి వచ్చింది. ఈ పదేండ్లలో ఎన్నో పనులు చేసినం. మరి తెలంగాణకు ఏం చేయని బీజేపోళ్లకు ఓటెందుకు వేయాలి. ఒక్క కారణమైనా బండి సంజయ్ చెప్పాలి. ఏమైనా అంటే గుడి కట్టినం అంటడు. మరి కేసీఆర్ యాదాద్రి కట్టలేదా..? ఇంకా కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి ఆధునిక దేవాలయం కట్టినం. రిజర్వాయర్లు, చెరువులు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు పూర్తి చేసినం. వాటికి కూడా దేవుళ్ల పేర్లే పెట్టుకున్నం. మరి దేవుళ్లకు ఇంత సేవ చేసిన కేసీఆర్‌కు ఓటు వేయాల్నా.. వద్దా..? మేం వాళ్ల లెక్క దేవుడి పేరిట రాజకీయాలు చేస్తున్నామా..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## అభివృద్ధా.. విధ్వంసమా..?

ఏది కావాలో ప్రజలే ఆలోచించాలి



వేములవాడ పట్టణంలోని పాత ఆంధ్రాబ్యాంకు ముందు రోడ్ షోలో మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్

- ప్రజల మేలు కోరే బీఆర్ఎస్‌ను గెలిపించండి
- అడ్డగోలు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్
- వేములవాడకు ప్రధాని మోడీ రూ.500 కోట్లు ప్రకటించాలి
- కాశీ మాదిరిగా అభివృద్ధి చేయాలి • కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్ • వేములవాడలో రోడ్‌షో

వేములవాడ, మే 6 : ''పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనసాగిన అభివృద్ధి కావాలా..? విధ్వంసం కోరుకునే కాంగ్రెస్ కావాలా? ప్రజలే తేల్చుకోవాలని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. అభివృద్ధే ఆకాంక్షగా పనిచేస్తున్న బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడ పట్టణంలోని పాత ఆంధ్రా బ్యాంక్ ఎదుట సోమవారం జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కాశీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన మంత్రి మోడీ అక్కడి ఆలయాన్ని అభివృద్ధి చేయడాన్ని పూర్తిస్థాయిలో స్వాగతిస్తున్నామని, దక్షిణ కాశీగా ఉన్న వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు బుధవారం వస్తున్న మోడీకి స్వాగతం తెలుపుతున్నామని చెబుతూనే వేములవాడ ఆలయానికి రూ.500 కోట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారత దేశంలోనే ఇంత పెద్ద గొప్ప ఆలయం మరెక్కడా లేదని, దీనిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకోవాలని కోరారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలను ప్రసాద్ స్కీం కింద పెట్టాలని పలుసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి మరో పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంచేందుకు కుట్ర చేస్తున్నారని, దీనిని అడ్డుకోవడం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత చాలా అభివృద్ధి చేశామని, రైతులు అవస్థలు పడొద్దని రైతుబంధు పథకానికి రూపకల్పన చేసినట్లు గుర్తు చేశారు. నారు పోసేటప్పుడు ఇవ్వాల్సిన రైతుబంధును కాంగ్రెస్ సర్కారు వరి కోతల సమయంలో ఇస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ప్రాజెక్టులు, చెరువులు ఎండాయని, సర్కారు అసమర్థతోనే కరువు వచ్చిందన్నారు. ఎప్పటి నుండో హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని బీజేపీకి మనసులో ఉందని, అడ్డగోలుగా ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి తప్పించుకునేందుకు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంత ప్రకటనకు మద్దతిచ్చేందుకు ముందుకు వస్తాడని ఆరోపించారు. ఆంధ్రాలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్‌రెడ్డి కలిసి మళ్లీ తెలంగాణను ఆంధ్రాలో కలిపే కుట్ర చేస్తున్నారని మండపడ్డారు. నదుల అనుసంధానం పేరుతో కేంద్రం కుట్ర రాజకీయాలు చేస్తున్నా బండి సంజయ్ తెలంగాణ కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. యువత ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రోడ్‌షోలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కిషన్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మ్యాకల రవి పాల్గొన్నారు.

### తెచ్చిన నిధులు ఏడపాయె



గత ప్రభుత్వం వెనక్కి తీసుకున్న నిధులు తెచ్చానని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెచ్చిన నిధులు ఏడపోయినయ్. వేములవాడ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వమే. మధ్య మానేరు, గుడి చెరువును ఎండబెట్టి రైతులు ప్రజల నోట్లో మట్టి కొట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హెలీ కాప్టర్‌లో దిగబోయే స్థలం కోట్లాది రూపాయలు వెచ్చించి సేకరించింది కూడా కేసీఆర్ ప్రభుత్వమే. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందిన్రు. బీజేపీ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.

- చల్మెడ లక్ష్మీనరసింహారావు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి



బ్యాటరీ రిక్షా నడుపుతున్న పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందర్

## రిక్షా నడిపి.. ఓట్లు అభ్యర్థించి

గోదావరిఖని, మే 6: పార్లమెంట్ ఎన్నికల పోరుకు మరో వారం గడువు మాత్రమే ఉండడంతో ప్రచారం జోరందుకున్నది. ఊరూరా హోరెత్తుతున్నది. అభ్యర్థులు, పార్టీ నేతలు వీధివీధినా తిరుగుతూ క్యాంపెయినింగ్ చేస్తుండగా, ఖనిలో సోమవారం బీఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ వినూత్నంగా ఓట్లు అభ్యర్థించారు. ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో మాజీ ఎమ్మెల్యే చందర్‌తో కలిసి బ్యాటరీతో నడిచే రిక్షాలు నడిపారు. ముందుగా బీఆర్ఎస్ యువజన నాయకుడు తోట వేణు పార్టీ ప్రచారం కోసం పర్యావరణ హితంగా రూపొందించిన బ్యాటరీ రిక్షా, తోపుడు రిక్షాలను కొప్పుల జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వాహనాలను నడిపి శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

## రూ.1.79 కోట్లు జప్తు.. రూ.1.67 కోట్లు విడుదల

పెద్దపల్లి, మే 6 : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.కోటి 78 లక్షల 97 వేల 132 జప్తు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ రూ.కోటి 67 లక్షల 37 వేల 32లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా రూ.11 లక్షల 60 వేల 100లు విడుదల చేయలేదని తెలిపారు.

## ఈడీసీనా.. పోస్టల్ బ్యాలెటా?

ప్రతి ఉద్యోగి నుంచి ఫాం 12, 12ఏ స్వీకరణ • ఎవరికేది అనేది ఇంకా నిర్ణయించని యంత్రాంగం

కరీంనగర్ కలెక్టరేట్, మే 6 : ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌తోపాటు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ)తో కూడా ఓటేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఉద్యోగ విధులు నిర్వహించే సెగ్మెంట్‌లోనే ఓటు హక్కు ఉన్న వారికి ఈడీసీ ద్వారా వారు విధులు నిర్వహించే పోలింగ్ కేంద్రంలో ఓటేసేలా, ఇతర నియోజకవర్గాల్లో విధులు నిర్వహించే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేసిన యంత్రాంగం, ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. పోలింగ్ విధులు నిర్వహించే వారికి రెండు సార్లు శిక్షణ ఇవ్వగా, మొదటిసారి ప్రతి ఉద్యోగికి ఫామ్ 12, రెండోసారి ఫామ్ 12ఏ అందజేసి వారి వివరాలు సేకరించారు. ఉద్యోగులకు విధులు కేటాయించిన విధంగా ఈడీసీ, పోస్టల్ బ్యాలెట్ అందజేయాలి. అయితే, దరఖాస్తు చేసుకున్న 13,623 మంది సిబ్బందిలో కొంతమందికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్లు అందినట్లు తెలుస్తోంది. విద్యాశాఖకు సంబంధించిన బోధన, బోధనేతర సిబ్బందికి వేసవి సెలవులు కొనసాగుతుండగా, చాలామంది తమ గ్రామాలకు వెళ్లారు. ఈ నెల 3 నుంచి పోస్టల్ ఓటింగ్ కొనసాగుతుండగా, ఈ నెల 8తో ముగియనుంది. అయితే, తమకు ఇతర నియోజకవర్గాల్లో పోలింగ్ విధులు కేటాయించడంతో పోస్టల్ బ్యాలెట్ వస్తుందనే ధీమాతో వారంతా దరఖాస్తు చేసుకున్న ఏఆర్‌వో కార్యాలయానికి వచ్చి సంప్రదిస్తున్నారు. అటు ఈడీసీ, ఇటు పోస్టల్ బ్యాలెట్ రెండు కూడా కేటాయించకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. శిక్షణ సందర్భంలో రెండు సార్లు ఫామ్‌లు సేకరించినా, పోస్టల్ బ్యాలెట్, ఈడీసీ రాకపోవడానికి గల కారణాలు ఏంటనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. పోలింగ్ సామగ్రి తీసుకునే సమయంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అందజేసే అవకాశాలున్నా, అక్కడ కూడా ఈడీసీ పంపిణీ చేయకపోతే, చాలామంది ఎన్నికల సిబ్బంది ఓట్లేయడం హుళక్కేననే చర్చ జిల్లా ఉద్యోగ వర్గాల్లో కొనసాగుతున్నది.